క్లుప్తంగా

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



విద్యార్థులకు నగదు బహుమతిని అందిస్తున్న ఉపాధ్యాయులు

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలని దామగట్ల పాఠశాల హెచ్ఎం అనితా జీవన్ అన్నారు. మండల పరిధిలోని దామగట్ల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జమాల్‌వలి, సురేష్‌కుమార్ అనే విద్యార్థులు ఆర్‌బీఐ వారు నిర్వహించిన క్విజ్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి నగదు ప్రోత్సాహ బహుమతులను గెలుచుకున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మోహన్‌రావు, రెజీనా, శైలజ తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

నందికొట్కూరు రూరల్ : మండలంలోని దామగట్ల గ్రామంలో అప్పులబాధతో పురుగుల మందుతాగి చనిపోయిన కౌలు రైతు మునేంద్రగౌడ్ (33) కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ దాసుకు వారు వినతి పత్రాన్ని అందజేశారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 440 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కంటి వైద్య నిపుణులు షేక్షావలి తెలిపారు. శనివారం పాఠశాలలో వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా హెచ్ఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 9 మంది దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించామని, వారికి త్వరలోనే కంటి అద్దాలు అందిస్తామని చెప్పారు.

ఆదర్శ ఉద్యోగులుగా రాణించాలి



ఆదర్శ ఉద్యోగులకు చెక్కు అందజేస్తున్న డీఎం నాగేశ్వరరావు

నందికొట్కూరు: ఆదర్శ ఉద్యోగులుగా రాణించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ నాగేశ్వరరావు కోరారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. అత్యధిక కేఎంపీఎల్ తెచ్చిన డ్రైవర్లు ఎస్ బాషా, ఎస్ లక్ష్మన్న, కేవీ. స్వామి, అత్యధిక టార్గెట్ తెచ్చిన కండక్టర్లు కే.వీ రమణ, పీఎం బాషా, ఏ. వెంకటేశ్వర్లుకు అవార్డులు అందజేశారు.

మిడుతూరు ఎస్ఐగా జగన్‌మోహన్



మిడుతూరు: మిడుతూరు ఎస్ఐగా జగన్‌మోహన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. వీఆర్‌లో ఉన్న ఎస్ఐ జగన్‌మోహన్ ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా మిడుతూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు.


కామేశ్వరీదేవికి పట్టువస్త్రాలు



పట్టువస్త్రాలు అందిస్తున్న దాతలు

మహానంది: మహానందిలో అక్టోబర్ 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న దసరా నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి దాతలు శనివారం పట్టువస్త్రాలు అందించారు. హైదరాబాద్‌కు చెందిన వారణాసి రామ్మోహన్‌రావు, విజయలక్ష్మి దంపతులు అమ్మవారికి ఉత్సవాలకు అవసరమైన పది పట్టుచీరలు, ఇతర వస్తువులను అందజేశారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని మాట్లాడుతూ దాతలు వారణాసి రామ్మోహన్‌రావు దంపతులు ఇరవై ఏళ్లుగా పట్టువస్త్రాలు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' విజయవంతం చేయండి



సర్వేను పరిశీలిస్తున్న జేఏఎస్ డిప్యూటీ డైరెక్టర్

నందికొట్కూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతం చేద్దామని జేఏఎస్ డిప్యూటీ డైరెక్టర్ రామనాథ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని 2వ సచివాలయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈనెల 30వ తేదీన విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణకు క్షేత్రస్థాయిలో వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఇంటింటికీ తిరిగి సర్వే చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్టేట్ అబ్జర్వర్ సాయికుమార్, అడిషనల్ డీఎంహెచ్ఓ శారద బాయి, అర్బన్ హెల్త్ మెడికల్ ఆఫీసర్ షైనీప్రియాంక పాల్గొన్నారు.

ఉత్సవాలకు వేళాయే

- ఈ ఏడాది భారీగా కొలువుదీరనున్న గణనాథులు
- విగ్రహాల కొనుగోళ్లతో మొదలైన సందడి
- ప్రతిమలకు పెరిగిన డిమాండ్
- మట్టి గణపతికి ప్రాధాన్యత



విక్రయానికి సిద్ధంగా ఉన్న గణనాథులు

ఆత్మకూరు: డివిజన్ పరిధిలో వినాయక చవితి పర్వదినానికి ఈ ఏడాది భారీ సంఖ్యలో గణనాథులు కొలువుదీరనున్నారు. ఆత్మకూరు పట్టణంతో పాటు శ్రీశైలం, వెలుగోడు, మహానంది, బండిఆత్మకూరు మండలకేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో వాడవాడలా గణనాథులను కొలువు చేసేందుకు నిర్వాహకులు మండపాలను సిద్ధం చేశారు. విగ్రహాలను తయారు చేసే శిబిరాల వద్ద వివిధ గ్రామాల భక్తులు కొనుగోళ్లకు భారీగా తరలివెళ్తున్నారు. దీంతో పట్టణాల్లో, పల్లెల్లో సందడి నెలకొంది.

వందకు పైగా విగ్రహాలు

గతంలో పల్లెల్లో ఒకటి, రెండు చోట్ల గణనాథులను ప్రతిష్ఠించేవారు. అయితే ఈ ఏడాది ఎక్కువ చోట్ల కొలువుదీరనున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో ఈ ఏడాది 100చోట్ల కు పైగా గణనాథులు కొలువుదీరనున్నాయని అంచనా. ఆత్మకూరు పట్టణంలో గతేడాది 20కి పైగా వినాయకులు కొలువుదీరగా, ఈ ఏడాది అంతకంటే ఎక్కువ స్థాయిలో విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు.

విగ్రహాలకు పెరిగిన డిమాండ్

వినాయక చవితి పర్వదినం దగ్గర పడుతుండటంతో విగ్రహాలకు డిమాండ్ ఏర్పడింది. చిన్న చిన్న విగ్రహాలు సైతం రూ.14 నుంచి రూ.20 వేలు ఉండగా, కొన్ని చోట్ల అత్యధికంగా రూ.25 వేలకు పైగా వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. విగ్రహాలు దొరికితే చాలు ఎంత ధరైనా చెల్లించి దక్కించుకోవాలని భక్తులు ఆరాటపడుతున్నారు. కేవలం 5, 6 అడుగుల విగ్రహం కూడా వేల రూపాయలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. పార్వతీపరమేశ్వరులతో కూడిన గణనాథుల విగ్రహాలతో పాటు , వివిధరూపాలలో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

మట్టి గణనాథుడికి ప్రాధాన్యత

ఈ ఏడాది ఆత్మకూరు పట్టణంతో పాటు పలు గ్రామాల్లో మట్టి గణనాథులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆత్మకూరు పట్టణంలో ఆర్యవైశ్య సంఘానికి చెందిన కొందరు భక్తులు మట్టి గణనాథులను ఇళ్లల్లో ఏర్పాటు చేసుకుని పూజలు నిర్వహించుకునేందుకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. పలు గ్రామాల్లో కూడ మట్టి ప్రతిమలకు ప్రాధాన్యత ఇస్తూ భక్తులు వివిధ రూపాల్లో, రంగు రంగుల అలంకారాల్లో కొలువుదీరుస్తున్నారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి

వినాయకచవితి సందర్భంగా వాడల్లో విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు తప్పనిసరిగా పోలీసులు అనుమతిని తీసుకోవాల్సి ఉంది. ఆత్మకూరు, వెలుగోడు పట్టణాల్లో ఇప్పటికే ఉత్సవ కమిటీలు పోలీసుల అనుమతులు తీసుకున్నారు. ఇంకా కొన్ని పల్లెల్లో, పట్టణ కమిటీ వారు కూడా అనుమతులకు అర్జీలు పెట్టుకున్నారు.

మండపాల వద్ద అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం



వినాయకచవితి పర్వదినం సందర్భంగా అన్ని మండలాల వద్ద జాగ్రత్తలు తీసుకున్నాం. భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలైన్లు కూడా ఏర్పాటు చేస్తున్నాం. గణనాథుని దర్శనానికి వచ్చే భక్తులకు ప్రత్యేక పూజలు, హారతులతో పాటు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తాం. రాత్రి వేళ కూడా మండపాల వద్ద కమిటీ సభ్యులతో ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

–రమణారెడ్డి, గణేష్‌కమిటీ అధ్యక్షులు,ఆత్మకూరు

గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం



డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో వినాయచవితి సందర్భంగా గణనాథులు కొలువుతీరిన మండపాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. మండపాల వద్ద రాత్రి వేళ గణేష్‌కమిటీ సభ్యులు అక్కడే ఉండేలా చర్యలు తీసుకున్నాం. మండపాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆయా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలి. నిమజ్జనం సమయంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా క్రమశిక్షణతో మెలగాలి.

– నాగభూషణంయాదవ్, సీఐ,ఆత్మకూరు

'ఆరోగ్య సురక్ష'పై ప్రత్యేక దృష్టి సారించాలి

పాములపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ గోపీకృష్ణ సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్షపై సర్వే నిర్వహించాలన్నారు. గ్రామ వలంటీర్లతో పాటు వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శి ఉండి పకడ్బందీగా ఒక ఇల్లు కూడా వదల కుండా సర్వే నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు, ఎంఈఓ–2 సుభాషిని దేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్లు పురోగతి పై సమావేశం నిర్వహించారు. ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల పై ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలని ఆదేశించారు.

వినాయకచవితి వేడుకలు ప్రశాంతంగా జరగాలి

మండలంలో వినాయక చవితీ వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ గోపీకృష్ణ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు ఉత్సవాలు జరిగేలా చూడాలన్నారు. వినాయక ప్రతిమల ఏర్పాటుకు సిద్ధం చేసిన మండపాలను పరిశీలించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, ఏఎస్ఐ ఏసయ్య పాల్గొన్నారు.

టీడీపీ కంచుకోటలో వైఎస్సార్‌సీపీకి విశేష ఆదరణ

- వేల్పనూరులో ఎథిక్స్ కమిటీ ౖచైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి జన నీరాజనం
- విజయవంతంగా ముగిసిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా భువనేశ్వర్‌రెడ్డిలను సత్కరిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

వెలుగోడు: తెలుగు దేశం పార్టీకి కంచుకోట లాంటి గ్రామం వేల్పనూరు. టీడీపీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్ చార్జ్, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్వగ్రామం. అలాంటి గ్రామంలో ప్రతి గడపకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందాయి. దీంతో ముఖ్యమంత్రికి రుణం తీర్చుకునేందుకు గ్రామస్తులు నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఆ రోజు రానే వచ్చింది.. నాలుగు రోజులుగా ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వేల్పనూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ నాలుగు రోజుల పాటు గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. వైఎస్సార్‌సీపీ జెండా గ్రామంలో రెపరెపలాడింది. ఏ ఇంటికి వెళ్లినా సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాల బ్రోచర్ కనిపిస్తోంది. తమకు సంక్షేమ పథకాలు అందించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని గ్రామస్తులు అక్కున చేర్చుకున్నారు. అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. మహిళలు ఎదురెళ్లి హారతులు పట్టారు. శనివారంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి కావడంతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డితో గ్రామస్తులు, నాయకులు భారీ కేక్ కట్ చేయించారు. ఇంటింటా పర్యటించిన శిల్పా చక్రపాణిరెడ్డి నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులకు వెల్లడిస్తూ వారి మద్దతు కోరారు. గ్రామస్తులు మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటామని ఎమ్మెల్యేకు మాటిచ్చారు.

ప్రతి కుటుంబం బాగుపడింది

ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ.. నాలుగు రోజుల పాటు గ్రామంలో విస్తతంగా పర్యటించి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించాం. గ్రామంలో ప్రతి కుటుంబం వద్ద బ్రహ్మాండమైన స్పందన కనిపించిందని, ప్రతి కుటుంబం బాగు పడిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 127 రోజులు ప్రతి గడపను టచ్ చేశానన్నారు. బీజేపీ, పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఏకమైనా కూడా వైఎస్ జగన్ ను ఏమీ చేసుకోలేరని గడప గడపకు కార్యక్రమంలో అర్థమైందన్నారు. వైఎస్ జగన్‌ను ఎదుర్కొనే సత్తా రాష్ట్రంలో ఏ పార్టీకి లేదు. వేల్పనూరు గ్రామంలో ఎన్నడూ లేని అభివద్ధి తన హయాంలో చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కోట్లాది రూపాయలు పొదుపు మహిళలకు రుణాలు , సొసైటీ బ్యాంక్ తరపున జేఎల్‌జీ లోన్లు ఈ గ్రామంలోనే ఎక్కువగా ఇప్పించగలిగానని చెప్పారు. నవరత్నాలు పథకాలతో ప్రతి గడపలో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

వేల్పనూరు గ్రామానికి చెందిన ఎల్లయ్య 20 గొర్రెలను కుక్కలు కొరికి చంపాయని స్థానికులు ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే స్పందించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్ రెడ్డి , ఏపీసీపీడీసీఎల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ శశికళారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బన్నూరు అంకిరెడ్డి, ఎంపీటీసీలు బన్నూరు తోయ జనాభా రెడ్డి, పల్లె వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, బన్నూరు సంజీవరెడ్డి, బోగోలు శివశంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అరటిరైతులను ఆదుకోవాలి

మహానంది: ఇటీవల అకాలవర్షాలు, భీకర గాలులకు నష్టపోయిన అరటిరైతులను ఆదుకోవాలని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. ఈ మేరకు నంద్యాలలో కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శుక్రవారం పలు అంశాలపై మాట్లాడారు. అందులో భాగంగా మహానంది మండలంలో ఇటీవల రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీమా వర్తింపు కోసం ఇన్సురెన్స్ కంపెనీలు ముందుకు రాలేదని, ప్రభుత్వం స్పందించి వెంటనే నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు.

పేదల ఆర్థిక స్థితి మార్పు కోసమే నవరత్నాలు

- జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



వద్దెమానులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు రూరల్ : రాష్ట్రంలోని పేదల ఆర్థిక స్థితిని మార్చేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను అమలు చేస్తున్నారని, ఆయనను మరో సారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ కోరారు. శనివారం మండల పరిధిలోని వద్దెమాను గ్రామంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో లక్షలాది కుటుంబాలు మేలు పొందాయన్నారు. ప్రతి ఇంట్లో ఉన్న పిల్లలందరూ చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలనే ధ్యేయంతో అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న గోరుముద్ద, నాడు–నేడు పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. సమాజానికి ఉత్తమ పౌరులను అందించాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమని అన్నారు. అనంతరం గ్రామస్తులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, ఎంపీడీఓ శోభారాణి, సీఐ విజయభాస్కర్, హౌసింగ్ డైరెక్టర్ రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు హరిసర్వోత్తమరెడ్డి, ఉదయ్‌కిరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి..

మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు జెడ్పీ హైస్కూల్‌ను ఎమ్మెల్యే ఆర్థర్ శనివారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకం గురించి పాఠశాల ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

జూటూరు ఆశ్రమంలో శ్రీశైల జగద్గురు



జూటూరు ఆశ్రమంలో స్వామిజీ

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలోని శ్రీ గురు సిద్ధ నాగసాయి బ్రహ్మ విద్య ఆశ్రమాన్ని శనివారం శ్రీశైలం జగద్గురువు డాక్టర్ చెన్న పండితాచార్య శివాచార్య మహాస్వామి సందర్శించారు. ఆశ్రమం ఆవరణలో రాధాకృష్ణ మందిరం, రామాలయం, ఈశ్వరాలయం, జగద్గురు మఠం, సాయిబాబా గురునిధి ఆలయాలను, జగద్గురు స్వామి కొరకు నిర్మించిన గదిని సందర్శించారు. స్వామీజీల విశ్రాంతి విడిది కోసం నూతనంగా రూ.30లక్షలతో నిర్మించిన గదులను ప్రారంభించారు. అంతకు మునుపు ఆశ్రమ పీఠాధిపతి రామానంద స్వామి ఘనంగా స్వాగతం పలికారు. ఆశ్రమంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆశ్రమ భక్తులకు దివ్య మంగళ ఆశీస్సులు తెలియజేశారు. స్వామీజీ వెంట గుంతకల్ మఠం జనరల్ మేనేజర్ మల్లప్ప, శ్రీశైలం జగద్గురు పీఠం ప్రతినిధి నజరాజ్ స్వామి, పూజారి ముత్తు స్వామి, విశ్వస్వామి, ప్రొటోకాల్ ఇన్‌చార్జ్ కౌశిక్ ఉన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

కొత్తపల్లి: నందికొట్కూరు నియోజకవర్గ స్థాయి పోటీలకు దుద్యాల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం మంగన్న, వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఎంపికైన విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. వారు మాట్లాడుతూ ఈనెల 14, 15 తేదీలలో మండల కేంద్రంలో జరిగిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో తమ పాఠశాల నుంచి వివిధ క్రీడల్లో 65 మంది పాల్గొనగా 40 మంది నియోజకవర్గ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారన్నారు. వీరు నందికొట్కూరులో ఈనెల 20, 21 తేదీలలో జరిగే క్రీడల్లో పాల్గొంటారన్నారు. ఉపాధ్యాయులు కృష్ణమోహన్, శంకర్ పలువురు పాల్గొన్నారు.

పగిడ్యాల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించిన క్రీడల్లో 7 క్రీడాంశాలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లను తాలుకా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కో ఆర్డినేటర్ కృష్ణ తెలిపారు. అండర్ –14 బాలుర విభాగం నుంచి కబడ్డీ పోటీలకు నెహ్రూనగర్, పగిడ్యాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల జట్లు, వాలీబాల్ పోటీలకు పగిడ్యాల, నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్లు, ఖో–ఖో విభాగంలో పగిడ్యాల, పాత ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్లు, బాల్ బ్యాడ్మింటన్, త్రో బాల్‌లో పగిడ్యాల, పాత ముచ్చుమర్రి జట్లు, టెన్నికాయిట్, యోగా పోటీలకు పగిడ్యాల, నెహ్రూనగర్ జట్లు ఎంపికయ్యాయన్నారు. అండర్–17 బాలుర విభాగం నుంచి కబడ్డీ పోటీలకు పగిడ్యాల, నెహ్రూనగర్ జట్లు, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలకు పగిడ్యాల, పాత ముచ్చుమర్రి జట్లు, త్రో బాల్ పోటీలకు పగిడ్యాల, పడమర ప్రాతకోట జట్లు, టెన్నికాయిట్, యోగా విభాగానికి పగిడ్యాల, నెహ్రూనగర్ జట్లు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

మిడుతూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003– 2004 బ్యాచ్ పూర్వపు విద్యార్థులు రూ.7,000 విలువ చేసే క్రీడా సామగ్రిని పాఠశాల హెచ్ఎం సాయితిమ్మయ్యకు శనివారం అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ పూర్వపు విద్యార్థులు, దాతలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని విద్య, క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్లస్వామి, భార్గవ, వాహిద్, వలిబాషా, రఘురాముడు, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక కౌలు రైతు మృతి

కొత్తపల్లి: అప్పుల బాధతో ఈనెల 14న పురుగుల మందు సేవించిన కౌలురైతు కర్నూలు వైద్యశాలలో చికిత్సపొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ హుస్సేన్‌బాషా తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. మండలంలోని నందికుంట గ్రామానికి చెందిన మైల సుధాకర్ (37) 4 ఎకరాల 40 సెంట్లు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. పంటల సాగుకోసం సుమారు రూ.4 లక్షల వరకు అప్పులు చేశాడు. అయితే నష్టాలు రావడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మృతుని భార్య మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ వివాహిత..

మహానంది: భర్త మృతితో ఆవేదన చెందుతూ ఒంటరిగా జీవిస్తున్న బండిఆత్మకూరు మండలం పార్నపల్లెకు చెందిన షేక్ మదార్‌బీ(28) ఈనెల 14న ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. మదార్‌బీ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

గ్రామాభివృద్ధికి దోహదపడాలి



మహిళలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: మహిళలు స్వయం వృద్ధితో పాటు గ్రామాభివృద్ధికి దోహదపడేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని వైకేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దాసు అన్నారు. మండలంలోని తాటిపాడు గ్రామంలో వనిత గ్రామైక్య సంఘం అధ్వర్యంలో పొదుపు మహిళలకు మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా డీపీఎం దాసు, ఏరియా కోఆర్డినేటర్ డేగలయ్య, ఏపీఎం అంబమ్మ మాట్లాడుతూ పొదుపు మహిళలు కేవలం డబ్బును పొదుపుచేసు కోవడం, బ్యాంకుల్లో తీసుకొన్న రుణాలను తిరిగి చెల్లించటమే కాకుండా గ్రామాభివృద్ధికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జోన్ ఏసీ రామాంజనేయులు, ఆత్మకూరు ఏసీ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం



మెడిసిన్ సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం

వెలుగోడు : జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయమని ఎంపీపీ లాలం రమేష్ అన్నారు. శనివారం వెలుగోడు జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థి ప్రోత్సాహక అభినందన సభ నిర్వహించారు. మొదటగా స్వర్గస్తులైన విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల ఉపాధ్యాయులకు, చనిపోయిన విద్యార్థుల ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ హెగ్డే అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో మౌలిక వసతుల కోసం అహర్నిశలు పాటుపడే డాక్టర్ శివ శంకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ సీతామహాలక్ష్మమ్మలను సన్మానించారు. అలాగే మెడిసిన్, పీజీ, ఎన్ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులను, పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల జయపాల్ గ్రామపంచాయతీ ఈఓ హరిలీల, ముక్కమల్ల భాస్కర్ రెడ్డి, లిటిల్ ఏంజిల్స్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఇమ్మానియేల్, ఓసా నాయకులు జయరామిరెడ్డి, సుల్తాన్ మొహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వే పకడ్బందీగా చేపట్టండి



తంగడంచలో భూసర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ పుల్లయ్యయాదవ్

జూపాడుబంగ్లా: సమగ్ర భూసర్వే ను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ సూచించారు. శనివారం మండలంలోని తంగడంచ గ్రామంలో రెండో విడతగా కొనసాగుతున్న సమగ్ర భూసర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పొలాలను సర్వేచేసే సమయంలో సంబంధిత రైతులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి, వారి వద్ద పొలానికి సంబంధించిన రికార్డులు పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. రికార్డులను అనుసరించి పొలాలను సర్వేచేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతుల మధ్య తగాదాలు నెలకొనకుండా వారి సమక్షంలోనే భూసర్వే చేపట్టాలని తెలిపారు.

ఘనంగా ఓజోన్ పరిరక్షణ దినోత్సవం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న అధ్యాపకులు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ వెంకట నరసయ్య మాట్లాడుతూ ఓజోన్ పొర దెబ్బతినడం వలన జీవజాలంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఓజోన్‌పొర పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులకు క్విజ్ నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు వైస్ ప్రిన్సిపల్ పద్మావతిబాయి, వెంకటసుబ్బయ్య, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

నందికొట్కూరు: హానికర సూర్య కిరణాలను భూమిపై పడకుండా రక్షణకవచంగా ఓజోన్ పొర ఉంటుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. సునీత చెప్పారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ అధ్యతన ఓజోన్ పొరపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డు కర్నూలు శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ రామకృష్ణ, అధ్యాపకులు గోవిందరాజులు, షాలిసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొరను కాపాడుకోవాలి

మహానంది: కాలుష్యం తగ్గించుకుని ఓజోన్‌పొరను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తిమ్మాపురం జడ్పీ పాఠశాల హెచ్ఎం నారాయణ తెలిపారు. అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా తిమ్మాపురం జడ్పీ పాఠశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మట్టితో వినాయకుడి విగ్రహాలను అందంగా తయారు చేసిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందించారు.

విగ్రహాలకు అనుమతులు తప్పనిసరి

కొత్తపల్లి: గ్రామాలలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గణపతి విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ హుస్సేన్‌బాషా తెలిపారు. శనివారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌లో విగ్రహ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మండలంలో మండలంలో 40 విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చామన్నారు. నిమజ్జనం వేడుకలకు డీజే అనుమతులులేవన్నారు.